# 'ఐ విల్ ప్రే ఫర్ యూ...!'

**సాయంత్రం...**

బాలభవన్ ఎదురుగా ఉన్న లాన్‌లో చెట్టు ప్రమాను ఆనుకుని కూర్చున్నాను. చుట్టూ పిల్లలు... పెద్దలు... పల్లీ బఠాణీవాళ్ళు... ఎంతో సందడిగా ఉన్నా, ఆ సందడిలో నాకు భాగం లేదు.

ఒంటరిగా కూర్చున్నాను ... జాస్మిన్ కోసం ఎదురు చూస్తూ.

ఇంటి నుంచి అయిదింటికే బయల్దేరి చిక్కడపల్లి నుంచి నడిచి ఇక్కడికి వచ్చేసరికి గంట పట్టినట్లే ఉంది. చీకటిలో మెర్క్యురీ దీపాలు పోటీ పడుతున్నాయి. ఆరు దాటిపోయిందేమో!

ఇంకా జాస్మిన్ రాలేదు. ఏమై ఉంటుంది?

వయసు పెరిగిన తరవాత ఇంటి దగ్గర మేం కలిసి మాట్లాడుకోవడం మా వాళ్ళకి అభ్యంతరం అని తెలిసిన తరవాత మేం ఏర్పాటు చేసుకున్న సంకేత స్థలం ఇది.

దొంగాట ఆడుతూ కాబోలు ఒక పాప నన్ను చాటు చేసుకుని తొంగి తొంగి చూస్తూంది. బాబ్ చేసిన జుట్టులో నుంచి చూస్తున్న ఆ కళ్ళు చూస్తుంటే, చిన్నప్పటి జాస్మిన్ గుర్తు వస్తూంది.

సుమారుగా... ఇదే వయసులో జాస్మిన్ వాళ్ళు మా ఇంటికి దగ్గరగా ఉన్న ఇంట్లోకి వచ్చారు...

వాళ్ళు ఆంగ్లో ఇండియన్స్. తండ్రి ఆర్మీ ఆఫీసరు. తల్లి మిలిటరీ హాస్పిటల్లో నర్స్. వాళ్ళిద్దరూ ఉద్యోగాలకు వెళ్ళిపోతే వాళ్ళతో ఉన్న ఆయా, వాళ్ళ అక్కయ్య, జాస్మిన్, రోజలీన్ ఉండేవాళ్ళు.

జాస్మిన్, రోజలీన్ కాన్వెంట్‌లో చదువుకునేవాళ్ళు. స్కూలు నుంచి రాగానే రోజలీన్ ఇంట్లోనే ఉండిపోయేది. జాస్మిన్ మాత్రం గేటు తెరుచుకుని వీధిలోకి వచ్చి మా వైపు చూస్తూ ఉండేది.

ఆ వీధిలో మిగిలిన ఇళ్ళన్నీ తెలుగు కుటుంబాలవి కావడంతో మాకు స్కూల్లో తప్ప, ఇంటి దగ్గర ఇంగ్లీషు వినవలసిన అవసరం కూడా కన్పించేది కాదు... తననీ మా జట్టులో కలుపుకోవాలని ఉన్నా, తెల్లగా ముట్టుకుంటే మాసిపోతుందేమోనని పించే జాస్మిన్ దగ్గరికి వెళ్ళలేక పోయేవాళ్ళం. మా మధ్య భాష కూడా అడ్డం కావడంతో ధైర్యం చేయలేకపోయాం.

అయినా నేమా, మా చెల్లెళ్ళూ, మా పక్కింటి పిల్లలూ అంతా కలిసి బొమ్మలపెళ్ళి చేస్తున్నా, బొమ్మరిళ్ళు కట్టుకుంటున్నా... మా ఆటలలో భావం తనకు అర్థం కాకపోయినా, తనే వచ్చేది మాకు దగ్గరగా

కొత్తలలో సైగలతో సరిపోయినా, రాను రాను 'వస్తా', 'పోతా' లతో ప్రారంభించి, క్రమంగా మాతో తెలుగు నేర్చేసుకుంది. మాలో ఎవ్వరమూ తనలా ఇంగ్లీషు మాట్లాడలేకపోయేవాళ్ళం. కానీ, తను మాత్రం అప్పుడప్పుడు తప్పులు మాట్లాడినా, ఇంగ్లీషు యాస నుంచి మెల్లి మెల్లిగా తప్పుకుని మాలా తెలుగు మాట్లాడటం నేర్చుకుంది.

వాళ్ళ అక్కయ్య మాత్రం ఎప్పుడూ మా దగ్గరికి వచ్చేది కాదు. ఎప్పుడైనా వాళ్ళ గేటు దగ్గర నిల్చుని చూసేదే కానీ, ఎప్పుడూ ఆటలకి వచ్చేది కాదు. కారణం అడిగితే చెప్పిం దొకసారి జాస్మిన్.

వాళ్ళ అక్క కంటే ముందు ఇద్దరు పిల్లలు పుట్టి బతకనపోతే, వాళ్ళ అమ్మ తనకు మూడోసారి పుట్టిన బిడ్డ బతికితే, 'సెలిబెసీ' ఇప్పించి, చర్చికి పంపిస్తానని మొక్కుకుందట. అప్పుడు పుట్టిన అమ్మాయి రోజలీన్. ఎప్పుడూ జీసస్ బుక్స్... బైబిల్—ఇవే చదువుతూ ఉంటుందట. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడదట.

జాస్మిన్ మాత్రం చాలా చలాకు. ఎంతో తెలివిగా కూడా అల్లరి చేసేది. ఇంగ్లీషు వాళ్ళ తెల్లని రంగు. మంచి ఆరోగ్యం. నీలం రంగుకి, ఆకుపచ్చకి మధ్యగా ఉండే రంగు కళ్ళతో మా అందరిలో ప్రత్యేకంగా కన్పించినా, మాతో ఎంతో స్నేహంగా ఉంటుంది.

మా వయసుతో ఆ స్నేహం పెరిగిందే కాని తరగలేదు. అందరిలో నన్ను ఎక్కువగా అభిమానిస్తున్నట్లు కన్పించేది. ఇప్పటికీ జ్ఞాపకం—బి.ఎస్‌సి. ఫైనలియర్ ఆఖరి పరీక్ష వ్రాసిన రోజు—

"మూర్తీ!... హౌ్ఎడిడ్ యూ డూ యువర్ ఎగ్జామినేషన్స్?" పరీక్ష హాల్లోంచి బయటికి వస్తుంటే అడిగింది జాస్మిన్. సమాధానంగా నవ్వేశాను.

"నై, మాన్! ఎలా రాశావనడుగుతుంటే నవ్వుతావేమిటి?"

"నా సంగతి సరే. నువ్వెలా వ్రాశావు?" అడిగాను చెప్పవలసిన సమాధానాన్ని దాటవేస్తూ.

"ఫైన్!... అంతే నీలా డిస్టింక్షన్ రాదు. ఫస్ట్ క్లాస్ కూడా ఎక్స్‌పెక్ట్ చేయడం లేదు. సెకండ్ క్లాసులో కంప్యూటర్ నా నంబరు దగ్గర సరిగా పని చేయకపోతే కన్పిస్తుంది. ఇకపోతే ఐ ఆమ్ ఫిట్ ఫర్ గాంధిస్ క్లాస్!"

నిర్మొహమాటంగా చెప్పేస్తున్న జాస్మిన్ మాటలకి నవ్వేశాను.

"ఎస్, మాన్! దట్స్ ట్రూ! దెన్... నీ సంగతేమిటి?... చెప్పావు కాదేం?... డిస్టింక్షన్ ష్యూర్! యామ్ ఐ కరెక్ట్?"

"అహా!...నో...నో... జాస్మిన్. దిస్ టైమ్ మే నాట్ గెటిట్!... ఫిజికల్ కెమిస్ట్రీ పేపరు పాడైపోయింది...పేపరులో నంబరు కనపడుతుందో లేదో తెలియదు..." నిరాశ ధ్వనించే ఉంటుంది నా గొంతులో.

"అంతే కదా!... ఆ ఒక్క పేపర్లో ఒక్క ప్రాబ్లమ్ పోతే, పేపరంతా పోయినట్లేనా?...నో... నో... డోంట్ గెట్ డిజప్పాయింటెడ్!... యు విల్ గెట్ ఫస్ట్ క్లాస్!..."

"ఏమో...నాకు నమ్మకం లేదు..."

"నో, మాన్!... బి హేపీ... డోంట్ వర్రీ!... ఐ విల్ ప్రే ఫర్ యూ!..." జాస్మిన్ మాటల్లో ఎంతో నిజాయితీ.

ఐ విల్ ప్రే ఫర్ యూ... ఎంతో స్వచ్ఛంగా అంటుంది... ఆమె మతం నేర్పిన ఆ మాటలు తరచుగా నేను తన నోటి వెంట వినేవాణ్ని అయినా ఆ గొంతులో నిజాయితీ అర్థం అవుతున్నకొద్దీ ఆమె పట్ల ఏదో ఆత్మీయత...నా కోసం ప్రార్థించే మరొక వ్యక్తి ఉందనే వెచ్చని భావం!

జాస్మిన్—ఇంకా రాలే దెందుకనో?—

నిరుద్యోగినైన నేను ఖాళీగానే ఉన్నా. గ్రాడ్యుయేషను ముగిసీ ముగియగానే డబ్బు అవసరం అనికాక సరైన కాలక్షేపం కోసమంటూ ఎక్కడో ఒక చోట—ఏదో ఒక రకంగా ఉద్యోగం సంపాదించి, ఏ ఒకటి రెండు నెలలో చేసి వాళ్ల దగ్గర పని చేయడంలో తనకు నచ్చని ఏ ఒక్క అంశం కన్పించినా దాన్ని ఖచ్చితంగా చెప్పేసి, తనకు ఎదురు తిరిగితే రాజీనామా ఇచ్చేసి వాళ్ళ దగ్గర్నుంచి తనకు రావలసినది నిలబడి గట్టిగా వసూలుచేసే జాస్మిన్ మంచి బిజీ మనిషి. అయినా చెప్పిన టైముకి వచ్చేస్తుంది. రాలేనని అన్పిస్తే, ఏ క్యూ.ఎమ్.ఎస్ లోనో ఉత్తరం వ్రాసి పడేస్తుంది—ఇంగ్లీషు లిపిలో...తెలుగు మాటల్ని....

మా వల్ల తెలుగు మాట్లాడడమైతే నేర్చుకుంది కానీ...మా నుంచి తెలుగు చదవడం, వ్రాయడం నేర్చుకోవడమంత తేలిక కాదని, తెలుగు దేశ రాజధానిలో అయినా తెలుగు నేర్చుకోవడం అవసరమనీ మాస్టర్‌ను పెట్టించుకుని, అయిదేళ్లలో తెలుగు మా కంటే బాగా నేర్చేసుకుంది. పదవ తరగతివరకూ అ ఆ లైనా తెలియని తను ఆ తరువాత నుంచి బి. ఎస్‌సి. వరకు రెండవ భాషగా తెలుగు తీసుకుని, అందులో సెకండ్ క్లాసు తెచ్చుకుంది. ఇంగ్లీషు

ఇష్టంవచ్చినట్లు వ్రాసి పారేసే జాస్మిన్ తెలుగు అక్షరాలు చాలా తీరికగా కూర్చుని, పొందికగా వ్రాసేది.

ఒకసారి నా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుగులో వ్రాసింది—'ప్రియ స్నేహితుడుసుందర రామచంద్ర మూర్తికి జన్మదిన శుభాకాంక్షలు — జాస్మిన్.

అంతే — అంతకన్నా ఏమీ లేదా నీలిరంగు కాగితంలో. తెలుగు అక్షర రూపంలో! జాజిమొగ్గలను నీటి రంగులో ఆ కాగితం మీద తీర్చి, వాటి మధ్య పై అక్షరాలు పొందికగా వ్రాసింది. తనకి వచ్చేసిన భాషమీద అంత శ్రద్ధ ఎందుకని అడిగితే— "నీ భాషకి నే నన్యాయం చేయకూడదు. గౌరవించాలి" అనేది.

"హాయ్, మూర్తీ! ఐ యామ్ సో సారీ—ఐ యామ్ టూ లేట్ టు డే!" చేతిలో బాగ్ గడ్డి మీద పడేస్తూ కూలబడింది జాస్మిన్.

"ఎంతసేపయింది వచ్చి?" అనడిగింది.

"మామూలు వేళకే!"

"అంటే యాజ్ యూజువల్ నాలుగింటికే బయల్దేరి అయిదింటికే ఇక్కడికి వచ్చావ్. బాప్ రే! ఇప్పుడు సెవెన్ ... అంటే త్రీ అవర్స్ యువార్ అలోన్! నేను రావడం కూడా గమనించలేదు. అంత ఇదిగా ఏ మూలోచిస్తున్నావ్?"

"నిన్ను గురించే."

"ఈజిట్! త్రీ అవర్స్ నన్ను గురించే? అంతసేపు ఏం ఆలోచించావబ్బా! మీ తెలుగు పిక్చర్ తీయవచ్చా, అయినా నా కథ ఎవరూ చూడరేమో కదా?"

"ప్చ్. పిక్చర్ కాదు. ఒక బయోగ్రఫీకి సరిపోతుంది. త్రీ అవర్సేనా? జీవితమంతా తలచుకోవలసిన అవసరం కలుగుతుందేమో!"

"ఓహ్! వాట్ ఏన్ ఐడియల్ స్టేట్‌మెంట్! నిజంగానే? అంతగా ఏం ఉందబ్బా? నన్ను గురించి తలచుకోవడానికి..."

"ఎంతో ఉంది!"

"ఎంతో అంటే?"

"ఒక పి హెచ్. డి. కి సరిపోను! చాలా?"

"అబ్బా! అద్సరే. పి హెచ్. డి. అంటే గుర్తు వచ్చింది.ఎమ్.ఎస్‌సి.చేయకుండాఅదేల? సోవై కాంట్ యూగో ఫర్ ఎమ్.ఎస్‌సి? దేరీజ ఒ వ్వే స్టిల్!"

రేపు నాన్న రిటైరయితే రోజు గడవట మెట్లా అన్న సమస్య పీడిస్తుంటే ఇప్పుడు నాకు చదువు ఎలా సాధ్యం? ఎమ్.ఎస్‌సి. చదవగలిగితేఇన్ని అగచాట్లు పడడ మెందుకు? నాకు నేనుగా పరిష్కరించుకోలేని సమస్యను పరిష్కరించి గమ్యం చూపించే దెవరు?

నా మూడ్ మార్చేసిన జాస్మిన్‌తో అది కుదిరే పని కాదన్నట్లుగా తల అడ్డంగా వూపాను. తన్నాపు చూపును మరల్చుకుంటూ...


"ఆదే.ఎందుకూ అడుగుతున్నాను?" రెట్టించింది జాస్మిన్.

మౌనంగానే ఉండిపోయాన్నేను. అర్థం చేసుకోగలవుకదా అన్నట్లుగా చూస్తూ.

"వోహ్... మూర్తీ! ఆదిరాదు. నాకు తెలుసు. మీ డాడీ ఈ సంవత్సరం రిటైరవుతున్నారు. యువార్ డెడ్లీ ఇన్నీడ్ ఆఫ్ జాబ్! నీకోసం ఒక జాబ్



వేలూరి ఉషశ్రీ




చూస్తాను. దాంతో మీ వాళ్ళకి సహాయం చేయు వచ్చు. నాకు జాబ్ ఉంది. ఐ హావ్ నో బర్డెన్ ఎట్ మై హోమ్! సో ఐ కెన్ హెల్ప్ యూ! లెట్ మీ స్టాండ్ బిహైండ్ యూ, ఫర్గెట్ కాలేజి స్టడీస్! యు మస్ట్, బి ఏ మాస్టర్ ఇన్ సమ్ సబ్జెక్ట్! ... ప్లీజ్ ... చేయకూడదూ?''

నాన్న సరిగ్గా మూడు నెలల్లో రిటైరయి పోతారు. ఇక్కడ నిరుద్యోగం నిరాటంకంగా రాజ్య మేలుతుంటే నాకు ఉద్యోగం వచ్చే సూచనలు కూడా లేవు. కనుక మా వూర్లో ఆ నాలుగెకరాల పొలమూ చూసుకుంటూ వ్యవసాయం చేసుకోవాలని నాన్న ఆలోచన. ఇంక అక్కడే ఉండిపోవాల్సి వస్తుందేమో నేను!

కానీ ... ఇక్కడ ఈ భాగ్య నగరంలో ఏ ఉద్యోగమూ దొరకక పోతుందా అన్న ఇంకా చావని ఆశతో ఉన్నా న్నేను. అంతా వెళ్ళిపోయినా ఇక్కడే ఉండి వీథుల్లో తిరుగుతూనో, పార్కుల్లో పడుకుంటూనో బ్రతికేయాలని ఉంది. ఆ మారుమూలల అయిన వాళ్ళ మధ్య పనికిరాని వాడిగా ఉంటూ బ్రతికే బ్రతుకు ఒక బ్రతుకేనా? ... ఈ పరిస్థితుల్లో ఇంకా ఏం పై చదువు? ఎందుకు ఏదైనా ఒక ఉద్యోగం కావాలి. ఉద్యోగం రావాలి!

"ఏమిటీ మౌనంగా ఉండిపోయావు? ఓ. కే. థింక్ ఓవర్ దట్ పాయింట్! ఆఁ అన్నట్లు ఇవాళ ఎందుకు ఆలస్యమైందో చెప్పలేదు కదూ! ఇవాళ ఒక ఆఫీసుకు వెళ్ళాను.''

తను చెప్పేది వింటూ తననే చూస్తున్నాను.

"అక్కడ ... ఇదివరకు రేస్ క్లబ్‌లో నేను పంచ్ ఆపరేటరుగా పనిచేసినప్పుడు పరిచయమయినాయనే ఆఫీసరు తెలిసింది మా కొలీగ్ వల్ల. సో, అక్కడి కెళ్ళాను. ఎందు కెళ్ళావని అడగవేం?''

"చెప్పు" అన్నాను.

"అక్కడ వేకెన్సీస్ ఉన్నాయని తెలిసింది. అసిస్టెంట్ గ్రేడ్‌లో ఒక యాభై మంది గ్రాడ్యుయేట్లు కావాలట. మంచి ప్రమోషన్స్ ఉంటాయట. విథిన్ టెన్ ఇయర్స్ యు కెన్ బికమ్ ఏన్ ఆఫీసర్—యూ నో?''

వివరాలన్నీ సవివరంగ తెలుసుకుని వస్తుంది. విషయం తెలిస్తే. విని వూరుకోవడం కాదు, ఆ సారం తెలుసుకోవాలనే ఆసక్తి చాలా కొద్దిమందిలో ఉంటుంది.

"ఒక పని చేయగలవ, మూర్తీ?''

ఏం చేయాలి? అసలు ఏం చేయగలన్నేను?

"ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజి కెళ్ళాలి. అక్కడ నీకు ఫోర్ ఇయర్స్ సీనియారిటీ ఉంది కదా. ఈ ఆఫీసులో వేకెన్సీస్‌కి ఎంప్లాయ్‌మెంట్ ద్వారా వెళ్ళాలి. అంటే లిస్ట్ వాళ్ళు పంపిస్తారు. ఆ లిస్టులో నీ పేరు వచ్చేలా చూడాలి. దెన్ ... ఆల్ ఎండ్స్ వెల్!''

కానీ ఆ లిస్టులోకి నా పేరు రావడం సాధ్యమా?

"కష్టం, జాస్మిన్! వాళ్ళు ఏ సంవత్సరం వాళ్ళని సెలెక్ట్ చేస్తున్నారో, లిస్టు ఎవరు తయారు చేస్తున్నారో తెలియదు. అసలు రిక్వెస్టు చేస్తే వాళ్ళకెంత చులకనో నీకు తెలియదు. ఆఫ్టరాల్ ఆఫీస్ బాయ్ కూడా క్యూలో ఏ కొంచెం ప్రక్కకి తొలిగినా మీద చెయ్యి వేయడానికి కూడా జంకడు. ఇంక ఆఫీసర్ని ... ఏమిటయ్యా మా సంగతి? అనడిగితే ఆయన మూడ్‌లో లేకపోతే కసరి, కార్డు విసిరవతల పారేస్తే, ఎక్కడుందో వెతుక్కుని తెచ్చుకోవాలి. వాళ్ళు మాలాంటి వాళ్ళ నెలా చూస్తారో నీకు తెలియదు. వెళ్ళిన ప్రతి సారీ కళ్ళనీళ్ళ పర్యంత మవుతూంటుంది.''

"అహ్ ... హ్హా హ్హా...'' అంటూ నవ్వేసింది జాస్మిన్.

వాతావరణం తేలిక పరచడానికో, లేక ఎందుకు నవ్విందో నా కర్థం కాలేదు.

"ఎస్ ... ఎసెస్ ... దట్స్ కరెక్ట్, మై డియర్ దోస్త్! వాళ్ళ జాబ్ సెక్యూరిటీ వాళ్ళ కా కాన్ఫిడెన్స్ ఇస్తుంది. ఆ ఆఫీసర్‌కి కార్డు విసిరిపారేసే మర్యాద నేర్పుతుంది. వాళ్ళ చదువు, అధికారం, పొజిషన్, సంస్కారం మరిచిపోయి కసరడాన్ని నేర్పుతుంది. సో ... దే నీడ్ నాట్ షో కర్టసీ ...''

పరిస్థితుల్ని అర్థం చేసుకునే జాస్మిన్‌కి క్రొత్తగా ఏం చెప్పక్కర్లేదు.

"ఓ. కే. దెన్ ఐ విల్ గో మై సెల్ఫ్! మన ఆఫీసరుకి మంచి ఇన్‌ఫ్లుయన్స్ ఉందిలే! ఎందరో ఫ్రెండ్స్ కూడా ఉన్నారన్నారు ఎక్స్‌ఛేంజిలో. సో ... నేనే వెళ్తాను. బాప్ రే! ఎనిమిదవుతూంది. ఇక లే. ఆకలేస్తూంది. కమాన్, గెటప్!''

లేచింది జాస్మిన్. తనను అనుసరించాన్నేను.

• • •

'అసిస్టెంట్ గ్రేడ్‌లో—ఉద్యోగం, స్కేలు వివరాలు శుక్రవారం పది గంటలకు ఫలానా ఆఫీసులో ... మీ ఒరిజినల్ సర్టిఫికేట్లతో, మీ సొంత ఖర్చు మీద హాజరు కావలయును.'

ఇంటర్వ్యూకి కాల్ వచ్చింది. ఎగిరి గంతేసినంత పనిచేశాను. ఉద్యోగం వచ్చేసినంత సంబరం. అదే మొదటి ఇంటర్వ్యూ! ఇన్నాళ్ళ నిరుద్యోగి జీవితంలో మళ్ళీఅనుమానం...భయం...సంకోచం...ఉత్సాహం... ఉద్వేగం... ఏమవుతుందోనన్న కుతూహలం!

ఇంటర్వ్యూ ముగిసింది. పద్నాలుగు ఎందరి మందిని ఏవో అడిగారు. తోచిన వేవో చెప్పాను, నన్నడిగిన రెండు నిముషాల్లో.

ఉద్యోగం వస్తుందో లేదో తెలియదు. జాస్మిన్ అడిగితే అదే చెప్పాను.

"బాగనే చేశాను కానీ, జాస్మిన్, వాళ్ళు సబ్జెక్ట్‌ని అసలు టచ్ చేయలేదు. ఎలా సెలెక్ట్ చేస్తారో మరి?''

"యూ మీన్ సబ్జెక్ట్? దే వోంట్ ఆస్క్... ఎందుకో తెలుసా? నువ్వు చేయబోయే ఉద్యోగం నువ్వు చదివిన దానికి సంబంధించినది కాదు. అంతే కాదు. ఆల్మోస్ట్ అన్ని ఖాళీలు ఇటువంటి దార్లలోనే నిండిపోతాయి. తెలిసిన వాడి ద్వారా ఫలానా సీట్లో కూర్చున్నారంటే ఆ తెలిసిన వాడిదే అభయ హస్తం. మనవాడు రిటైరయ్యేలోగా మనం పర్మనెంట్ లయిపోతాం. మనకే కొన్ని హక్కులు వస్తాయి. సో— ఉయ్ నీడ్ నాట్ వర్రీ!''

"బాగుంది!''

• • •

ఉద్యోగం వచ్చింది!

'ఐవిల్ ప్రే ఫర్ యూ!' అనే జాస్మిన్ మాటల్లో నిజాయితీ ఆర్డర్స్ అందుకున్న రోజు చాలా బలమైందనిపించింది.

జాయినింగ్ రిపోర్టు ఇచ్చి ఉద్యోగంలో చేరి పోయాను.

అంతా కొత్త! ఏది చేయాలన్నా ఏదో తడబాటు! అదృష్టం కొద్దీ నాకు పని నేర్పుతున్న సీనియర్ క్లర్క్ హరిహర శర్మ మంచివాడే. ఎన్ని తప్పులు దొర్లినా ఎంతో చనువుగా మందలిస్తూ ఎలా చేయాలో చెప్పాడు.

నాలుగు రోజులు పని పాత బడినాక, నా విషయాలు అడిగాడు. కొన్ని మరీ వ్యక్తిగత విషయాలడిగినా, ఆయన చనువుగా అడుగుతుంటే కేవలం నా వ్యక్తిత్వం నిలుపు కోవడం కోసం నా గిరిలో నేను నిలబడటం కోసం 'నా స్వవిషయం' అనాలనిపించక, అనాలనుకున్నా అనలేని బలహీనత వెనక్కి లాగితే

అడిగినవన్నీ చెప్పేసినప్పుడు మనసంతా శూన్యంగా అన్పించేది. ఒక రోజున అలాగే ఆయన అడిగాడు.

"నీకు మిస్ జాస్మిన్ ఫ్రెడరిక్ తెలుసునేమి టయ్యా, మూర్తీ?"

ఈయన కెలా తెలిసింది?...

తెలుసునన్నట్లు తల వూపాను, జవాబు వాశిస్తూ వా వైపే ఆయన చూస్తూ ఉంటే.

"ఆ అమ్మాయి చాలా మంచిదిలా ఉందయ్యా! మీ రిద్దరూ మంచి స్నేహితులేమిటి?" అదోలా నవ్వా డాయన.

తలవంచుకుని రిజిస్టర్‌లో వాగన్ప లిస్టు వ్రాస్తున్నాను.

"నాకెలా తెలిసిందని అడగవేం? నీకు ఉద్యోగం రాకముందు...ఏదీ—ఈ ఉద్యోగాలకి జనం కావాలి అని మేం అనుకుంటున్నప్పట్నుంచే సుమారుగా నీకు ఆర్డర్స్ దగ్గరుండి టైప్ చేయించే వరకూ తరచుగ వస్తుండేది. మాంచి సరదాగా మాట్లాడు తుంది!"


ఆయన మాటలు వింట న్నాను, పని చేస్తూనే.

"తనకెంత ఫ్రీగా ఉండేదంటే, మన ఆఫీసరు

నేను అదిరిపోయాననుకో! నాకూ ఇలాంటివి తగ లటం నా సర్వీసులోనే కొత్త! ఆ పైన ఏముయుందో నని నీకు మాత్రం తెలుసుకోవాలనుండదూ? ఉంటుంది. నాకు తెలుసు. అందుకే నేనూ వాళ్ళ మాటల ప్రకారం ఆ రోజునే అదే సిన్మాకు వెళ్ళానోయ్. అదృష్టం కొద్దీ వాళ్ళు కూర్చున్న వరుసకి వెనుకనే నేనూ కూర్చున్నానోయ్. సినిమా దేం ఉంది. వెధవది మర్నాడయినా చూడచ్చునని చెప్పి వాళ్ళనే గమనించాననుకో. మన బాస్ మనతో ఎంత ఇదిగా ఉంటాడో ఆడవాళ్ళతో అంతకంటే 'ఇది'గా ఉంటాడని ఆ రోజే తెలుసుకున్నాననుకో. ఆయన చేయి ఎప్పుడు కదిలినా ఆ అమ్మాయి ఎంత సుతారంగా తప్పుకునేదంటే, పాపం! ఆ మానవుడు మూడు గంటల్లో ముప్పై సార్లు ప్రయ త్నించినా, వూహూ! నిజంగా ఆ అమ్మాయి తెలివిని మెచ్చుకోవాలోయ్! ఇంకో ఇంకో పిల్లయితే బిక్క చచ్చి వూరుకునేది! టోటల్ టాలీ అయిందా— వెరీ గుడ్!"

రిజిస్టర్ మూసి ఆయన కేసి చూశాను.

"అదలా అయిందా... సరి ఇంకా ఆ ఆఫీసరు



ఒక సారి..,నేను విన్నది. చూసింది చెప్పకూడదనుకో. అయినా మనలో మాట అందులోనూ మీ రిద్దరూ స్నేహితులు. ఇంతకీ ఒక రోజున వరంగల్‌కి బుక్ చేసిన ట్రంక్‌కాల్ ఏమయిందో తెలుసుకుందామని లోపలికి వెళ్ళానయ్యా. నేను ఆపరేటరుతో గొడవ పడుతుంటే, వాళ్ళు అంతవంకా ఏం మాట్లాడుకున్నారో తెలియదు కానీ, మన ఆఫీసరు గారు ఆ అమ్మాయితో—మీ జాస్మిన్‌తో — ఏమన్నాడో తెలుసునా? నీకు తెలీదు. నువ్వింకా కుర్రాడివి గనుక... ఏభై దాటినాయన ఆయన అలా అంటాడా అని అనుకుంటావు కానీ, ఆయనే మన్నారో చెప్పనా? ఇదిగో—ఇలా దగ్గరగా రా —ఆ అమ్మాయిని తనతో ఒంటరిగా సిన్మాకి రమ్మన్నా డోయ్! . . ."

నా ముఖంలో ఏ భావమూ ఆయన క్కనబడనీ కుండా ఉండేటందుకు టోటల్ టాలీ అయిందీ, లేనిదీ చూస్తున్నాను.

"అంతే! ఆ అమ్మాయి విషయమేమో కానీ 'ఇంత' తెలివైన అమ్మాయి సిఫార్సు చేసిన నిన్ను ఎలా సెలెక్ట్ చేశాడనుకుంటున్నావు? ఆ అమ్మాయి ఆయన్ని దగ్గిరికి రానిచ్చి, రానిచ్చి, చివరికి ఒక శుభ ముహూర్తాన నేను అక్కడ ఉండగానే, మీరు మంచి వారిలా ఉన్నారు సార్... మిమ్మల్ని చూస్తుంటే ఫాదర్లీ రిలేషన్ షిప్ ఫీలవుతున్నాను అనేసింది. రోజూ ఒకసారైనా వచ్చి ఒక గంటసేపు కూర్చుని, ఆయన మాట్లాడేది ఒక అరగంట విని, తను ఒక అరగంట చెప్పి వెళ్ళేది. ఇంకా నాకు ఆశ్చర్యమన్పించిం దెప్పుడంటే, ఆయన షుగర్, బి. పి. కంప్లె యింట్లతో ఆసుపత్రిలో అడ్మిట్ అయిన నెల రోజులూ ఆ అమ్మాయి సొంత కూతురు కంటే ఎక్కువగా సేవ చేసేదనుకో! ఎప్పుడు మాలో ఎవరు వెళ్ళినా, ఆయన భార్య కన్పించేది కాదు కానీ, ఈ అమ్మాయే మందు ఇస్తూనో, పండ్ల రసం ఇస్తూనో కన్పించేది. నీ ఉద్యోగం నీ ఫస్ట్ క్లాస్ డిగ్రీకంటే... నిజం చెప్పానని బాధపడకు గానీ, మూర్తీ! ఆ అమ్మాయి ఆయన్ని ఆకట్టు కున్న తీరు గొప్పదోయ్. అందుకే నువ్వు ఆ అమ్మా యికి ఎంతగా కృతజ్ఞతలు చెప్పుకున్నా చాల దనుకో!"

కృతజ్ఞతలు ఎలా తెలియజేయను?...

● ● ●

నాన్న రిటైరయ్యారు. అమ్మనీ, చెల్లాయిలనీ తీసుకుని మా వూ రెళ్ళారు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు అయినాక సమస్య .సుమిత్రా, రమణి అతి కష్టం మీద గ్రాడ్యుయేషన్ ముగించారు. జీవితం అంటే నవలలు, సినిమాలు, కలలు అన్న నిర్ణయానికి వచ్చిన ఆ ఇద్దరికీ మధ్య తరగతి జీవితంతో రాజీ పడాలనే ఆలోచన లేదు. రచయిత్రులు చూపించే బంగారు కలలు వాళ్ళ కళ్ళలో కాపురం చేస్తాయి. నవలలకోసం, సినిమాల కోసం వాళ్ళు అమ్మ దగ్గరా, నాన్న దగ్గరా చేసే గారబాలు చూస్తుంటే నాకు జాస్మిన్ గుర్తు వస్తుంది.

తండ్రి ఆక్సిడెంట్‌లో పోయాడు. తల్లి కాన్సర్‌తో చనిపోయింది. అక్క 'సెలిబసీ' తీసు కుంది. ఎప్పుడైనా వెళ్ళి చూసి రావడమే గానీ, ఆ అక్క తోడుగా ఉండే అవకాశం లేదు. ఒంట రిగా జీవిత పోరాటాన్ని సాగిస్తూ, అందులో చేదును సైతం ఆనందంగా స్వీకరించే జాస్మిన్ అంటే నా కొక మంచి అభిప్రాయం ఉంది.

ఎందరు మగవాళ్ళ మధ్య తిరుగుతున్నా నాకు తెలిసినంత వరకూ తనను తాను కాపాడుకుంటూ వస్తున్న జాస్మిన్ పట్ల నాకు గౌరవం ఉంది. స్నేహ భావం ఉంది.

నాకు ఎంతో చేరువగా వచ్చిన ఆమె నా జీవిత భాగస్వామిని అయితే ...

ఈ ఆలోచన ఎన్నోసార్లు వచ్చింది.

ఒక శుభోదయాన—ఎర్లీ అవర్స్‌లో—నా దగ్గ రకు వచ్చి, నేను మర్చిపోయిన నా పుట్టినరోజు గుర్తు చేస్తూ జాస్మిన్ విష్ చేస్తుంటే — నాకు తెలియకుండానే కళ్ళు చెమర్చాయి.

తనను దగ్గరగా తీసుకోవాలనిపించింది.

వారించని జాస్మిన్ ప్రవర్తన నాలోని మగవాడిని ప్రోత్సహించినట్లనిపించింది. స్త్రీ స్పర్శలోని ఏదో స్టిములేషన్ నన్ను లోబరచుకుంటున్న సమయంలో నా నుదుటిని సున్నితంగా చుంబించి దూరంగా జరిగిపోతూ అంది—

"విత్ యువర్ పేరెంట్స్ కైండ్ పర్మి షన్ . . . ఇంకా నీ నిర్ణయంతో తప్పకుండా దగ్గ రవుతాం, మూర్తీ! నీ భార్యగా నీకు దగ్గర కాగలిగిన రోజునే మొదటిసారిగా— అప్పైదాకా వెళ్దాం . . . అంతవరకూ ఎక్స్‌క్యూజ్‌మీ! . . . ఆ రోజు కోసం ఎదురుచూస్తాను!... డోంట్ గెట్ ఎక్సైటెడ్— ప్లీజ్ — ఫర్ మై సేక్! — కంట్రోల్ యువర్ సెల్ఫ్—"

ఇంకా తగ్గని ఆవేశం— ఏదో చేయమంటూంది.

"కాదనకు, జాస్మిన్ . . . ప్లీజ్ . . . . నిన్ను తప్పకుండా పెళ్ళి చేసుకుంటాను. నువ్వంటే మా వాళ్ళకు ఇష్టం. వాళ్ళు తప్పకుండా ఒప్పుకుం టారు. 'ఆ రోజు' ఈ రోజు ఎందుకు కాకూడదు— ప్లీజ్— . . ."

"సారీ, మూర్తీ! నీ స్నేహితురాలిగా నేను మీ వాళ్ళకు పరిచయమే కానీ నీ భార్యగా అంగీకరించక పోవచ్చు. భార్యగా తప్ప—మన మధ్య ఆ సంబంధానికి నా మన స్సంగీకరించదు — అంతవరకూ మన స్నేహాన్ని... ప్లీజ్ . . . దయచేసి ఈ రకంగా కలుషితం చేసుకోవడం నా కిష్టం లేదు—"

ఆవేశాన్ని చల్లార్చని ఆడదానిగా కనిపిస్తున్న జాస్మిన్ చిరాకును కల్గిస్తూంది.

"మావాళ్ళు కాదంటే నిన్ను చేసుకోనేమోనని భయపడుతున్నావా?"

"నో...నో...భయం కాదు, మూర్తీ! వాళ్ళు కాదన్న తరవాత నిన్ను పెళ్ళి చేసుకుని వాళ్ళకు నిన్ను దూరం చేయడం—మీ మధ్య మనఃస్పర్ధలకు నేను కారణం కావడం—నో, నా కిష్టం లేదు."

"జాస్మిన్! . . .ఏవో వూహించుకుని వెనకడుగు వేస్తున్నా వంతే!... నాకు నువ్వు కావాలి! ... ప్లీజ్!"

"నువ్వు లిమిట్స్ దాటుతున్నావు,మూర్తీ!...ఐ విల్ ప్రే ఫర్ దట్ డే టు కమ్ సూన్!— మళ్ళీ కలుద్దాం...నిన్ను చూస్తుంటే ఇప్పుడు నిజంగా నాకు భయం వేస్తూంది!" అంటూ తలుపు తెరుచుకుని వెళ్ళిపోయింది.

ఇక ఆ రోజు ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు. రోజంతా పడుకునే ఉన్నాను.

ఆ మరునాడు ఆఫీసుకు వెళ్ళాను.

నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

"చిరంజీవి మూర్తిని ఆశీర్వదించి వ్రాయునది...

ఇక్కడ క్షేమం. నీకు ఒక సంబంధం నిశ్చయిం చాము. పిల్ల పదవ తరగతి వరకూ చదువుకుంది. వాళ్ళ తరఫు వాళ్ళే సుమిత్రకీ సంబంధం కుదిరించి. నీకు అభ్యంతరం ఉండదన్న కొండంత నమ్మకంతో, ఎదిగిన ఆడపిల్లకు పెళ్ళి చేయవలసిన బాధ్యతతో ఒప్పుకున్నాను. ఒకసారి నువ్వు వస్తే ముహూర్తం పెట్టుకుందాము. అన్నట్లు—అమ్మ కూడా నీ మీద బెంగతో ఉన్నది. సాధ్యమైనంత త్వరగా వచ్చేటందుకు ట్రాన్స్ఫర్ చేయించుకుని పెద్ద తనంలో దగ్గరగా ఉంటావని ఆశిస్తున్నాను.

—ఇట్లు, మీ నాన్న."

ఉత్తరం చదివిన తరవాత పని చేయలేకపోయాను. సెలవు పెట్టి వచ్చేశాను.

● ● ● ●

వారం రోజుల తరవాత ఆలోచనలను తెంచుకుని చేసుకున్న నిర్ణయం— మా వాళ్ళకు దగ్గరగా వెళ్ళిపోవాలని.

జాస్మిన్. . . . .

నన్ను కాదన్న... నన్ను నమ్మలేకపోయిన జాస్మిన్ గుర్తువస్తుంటే— నిజంగానే దూరంగా వెళ్ళిపోవా లనిపించింది.

తననే నమ్ముకుని నా వాళ్ళకు దూరం కాలేను. ట్రాన్స్ఫరు కోసం అప్లికేషన్ పెట్టుకున్నాను.

● ● ●


రెండు నెలల తరవాత ఆర్డర్సు వచ్చాయి.

ఈలోగా నేను మా వూరు వెళ్ళి రావడం, ముహూర్తం పెట్టుకోవడం జరిగిపోయాయి. రిలీవింగ్ ఆర్డర్సు నాలుగు రోజులలో ఇస్తానన్నాడు ఆఫీసరు.

వూహ తెలిసినదాదిగా, ఇరవై ఏళ్ళు పెంచిన వూరు హైదరాబాద్ వదలి వెళుతుంటే—అందరూ కోరికోరి ఈ వూరు వస్తుంటే, నేను కాదనుకొని వెళ్ళ వలసి రావడం — రైలుస్టేషనుకు వెళుతుంటే గుండె బరువుగా అన్పించ సాగింది.

ఆశ నిరాశల మధ్య చావు తప్ప మార్గం లేదనుకున్న నాకు బ్రతుకుతెరువు కల్పించి, నా ఉనికికి ఒక గుర్తింపు కలిగించిన చోటు నుంచి వెళ్ళిపోతున్నాను.

జాస్మిన్...ఈ రెండు నెలల్లో కలుద్దామని ప్రయత్నించినా నాకు నేనుగా కలవడానికి నిరాకరించి, కలవడం మానేశాను. తను బాధపడుతూ ఒక ఉత్తరం వ్రాసింది. చదువుకుని చెమర్చిన కళ్ళు తుడుచుకున్నానే కానీ జవాబు వ్రాయ లేదు.




రైలు స్టేషన్‌లో శర్మగారు కన్పించారు. వాళ్ళ అమ్మాయిని తీసుకు రావడానికి ఆయన శ్రీమతిని రైలెక్కించడానికి వచ్చారట.

నా ట్రాన్స్ఫర్ విషయం కదిలిస్తూ అన్నారు.

"నిజమైన స్నేహాన్ని—నిజంగా, మూర్తీ! ఇంత వరకూ ఎరుగనయ్యా! ఏదో ఎవరి పలుకుబడినో ఉపయోగించుకొని బ్రతికిన వాడినే కానీ — మీ స్నేహం చూస్తుంటే, నాకే కళ్ళు చెమరుస్తున్నా యయ్యా!"

జాస్మిన్ గురించి మాట్లాడుతున్నాడని తెలుసు కోవడానికి కొన్ని క్షణాలు పట్టింది నాకు.

"ఇంత త్వరగా నీకు ట్రాన్స్ఫర్ రావడానికి ఆ అమ్మాయి పడిన శ్రమ తలచుకుంటే—ఆ అమ్మాయి లాంటి కూతురుంటే బాగుండునన్పించిందయ్యా! మన ఆఫీసరు నిన్ను పంపించడానికి ఇష్టపడక పోతే మ్యూచువల్ ట్రాన్స్ఫర్‌గా దానిని మార్పించి, అక్కడ నుంచి అప్లికేషను త్వరగా తెప్పించి నీ ట్రాన్స్ఫర్ ఆర్డర్సు స్వయంగా టైప్ చేసి ఇప్పించిందయ్యా!"

ఆయన మాటలు వింటూ ఉంటే కళ్ళు చెమరుస్తున్నాయి. దూరంగా చూస్తూండిపోయాను.

కన్నీటి తెరల్లోంచి...దూరంగా తెల్లటి చీరలో, బాబ్ చేసిన జుట్టు నడకకి లయగా కదులుతుంటే, వస్తున్నది జాస్మిన్...చేతిలో బొకేతో.

వెళుతున్నాను అన్న మాట సైతం చెప్పకుండా వచ్చేసిన నేను ఎంత నమ్మక ద్రోహిని! నా ఈ ద్రోహాన్ని క్షమించి, ఆదరించే జాస్మిన్ స్వచ్ఛమైన హృదయం అందుకునేటందుకు నా అర్హత ఎంతవరకు?

"హాయ్, మూర్తీ! హాపీ జర్నీ... హాపీ మారీడ్ లైఫ్. హాపీ ఫ్యూచర్!..."

నా చేతికి బొకే నందించి స్వచ్ఛంగా నవ్వుతున్న జాస్మిన్‌ని చూస్తూంటే కన్నీళ్ళు కిందికి జారి పోతున్నాయి.

"ఏయ్, మాన్! వాటీజ్ దిస్..." తన చేతిలో కర్చీఫ్ అందించింది.

కళ్ళు తుడుచుకున్నాను

"నిన్నటి నుంచి నిన్ను కలవాలని చాలా ప్రయత్నించాను, మూర్తీ! బట్ ఐ కుడ్ నాట్ గెట్ యువర్ అడ్రస్! నిన్ను నేను కలుసుకోకుండానే వెళ్ళిపోతావేమోనని చాలా భయపడ్డాను. బట్ అయామ్ లక్కీ ఇనఫ్—అమ్మనీ, నాన్ననీ అడిగానని చెప్పు."

మౌనంగా వింటున్నాను —

ఆమె స్వచ్ఛదనం ముందు గిల్టీగా నిల్చుండి పోయాను.

రైలు వచ్చింది. రైలు కదులుతుండగా దిగి పోతూ "విష్ యూ ఆల్ ది బెస్ట్, మూర్తీ!" అంటూ నా చేతిని ఒకసారి నొక్కి వదిలేసింది. చేయూపుతున్న ఆమె కళ్ళలోనూ నీటి తెర—

నా కొక పరిధిని నిర్మించి, ఆ పరిధిలో నుంచి రానీయని నా బలహీనత...గాలిలో కదులుతూ సెండాఫ్ చెప్తున్న ఆ చేతిని అందుకోలేని అసహాయత...కన్నీళ్ళుగా జారుతుంటే చేతిలోని జాస్మిన్ కర్చీఫ్‌తో తుడుచుకుంటూ ఆమె ఔన్నత్యానికి నమస్కరించాను!

*